17వ
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం,10 ఫిబ్రవరి 2024


# ఎ.పి.ఎన్.జి.ఓ సంఘం డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎ.పి.ఎన్.జి.ఓ. సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశము శుక్రవారం ఎన్.జి.ఓ. హెూం లో జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామమోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం నందు ఐఆర్ చెల్లింపు గురించి, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల పెంపుదల గురించి, ఓపిఎస్ అమలు గురించి, హెల్త్ కార్డులు మరియు పెండింగ్లో ఉన్న డి.ఎ. బకాయిలు, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ మరియు ఇఎల్ యొక్క ఎన్క్యాష్మెంట్ మొదలైన వాటి గురించి చర్చించడం జరిగినది. ఈ డిమాండ్స్ నెరవేరకపోతే రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమనికి వెళ్ళటం జరుగుతుంది అని దానికి అన్ని యూనిట్ల అధ్యక్షులు కార్యదర్శిలు మరియు కార్యవర్గ సభ్యులు సిద్ధంగా ఉండాలి అని అన్నారు. ఈ సమావేశం నందు ముఖ్య అతిథిగా ఏ.పి.ఎన్.జి.ఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎ.పి.ఎన్.జి.ఓ. సంఘం జిల్లా కార్యదర్శి పేపకయాల వెంకటకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ళ చంద్రరావు, కె.వి.ఎన్.వి. ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శిలు ఎన్.ఎం.కే.జి.ప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఎన్.వీరబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి (మహిళా) వి.కమల మరియు 21 యూనిట్స్ అధ్యక్షులు కార్యదర్శిలు మహిళా విభాగం జిల్లా చైర్ పర్సన్, జిల్లా కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమమే అభివృద్ధి - అభివృద్ధి ధ్యేయమే సంక్షేమం





**కాకినాడ,మేజర్న్యూస్ :** టి.వి.,ఎ.సి.,గ్రైండర్లు ఉచితాలు, కానీ విదేశీ విద్య, గోరుముద్ద, ఫీజ్ రీయెంబర్స్మెంట్, ఆరోగ్యశ్రీ వంటివి ముమ్మాటికీ అభివృద్ధేనని మాజీ చీఫ్ సెక్రటరీ, ముఖ్యమంత్రికి సలహాదారు అజేయ కల్లాం పేర్కొన్నారు. "సంక్షేమం, అభివృద్ధి సమ్మిళిత పాలన-ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై జేఎన్టియూ యూనివర్సిటీ, కాకినాడలో ఓపెన్మైండ్స్ అధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా అజేయ కల్లాం మాట్లాడుతూ రాబోయే 100 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకునే 11 మెడికల్ కాలేజీలు స్థాపించడం జరిగిందనీ, మంచి ఫారిన్ యూనివర్శిటీలో అడ్మిషన్ వస్తే 1కోటి 25 లక్షల వరకు సంపూర్ణ సహకారం ఇస్తున్నామనీ, 80 లక్షలు పైగా లబ్ధి పొందినవారు కేవలం విదేశీవిద్య స్కీమ్ వలన వేలమంది నిరుపేద విద్యార్థులున్నారని పేర్కొన్నారు. 15 వేల సెక్రటేరియెట్స్లో ప్రభు త్వం 75వేల కోట్లు ఖర్చు చేసిందని, 16వేల కోట్లతో పోర్టులు అభి వృద్ధి అవుతున్నాయని తెలిపారు. ఇండియాలోని 31% షేర్ ఫిషరీస్తో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది, 10 ఫిషింగ్ హార్బర్స్లో 3,800 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. 100 కంపెనీలతో ఎమ్.ఓ.యు. వలన 13 లక్షల కోట్లు అభివృద్ధికి శాశ్వత పునాది వేశామన్నారు. 'రెన్యూవబుల్ ఎనర్జీ'లో ఇండియా కేపిటల్గా ఆంధ్ర ప్రదేశ్ కాబోతుందని, అత్యంత అవకాశాలు రాజస్థాన్తోపాటు సమంగా ఉన్నాయని 8 లక్షల కోట్ల రూపాయలకు 'గ్రీన్కో' వంటి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్లో సోలార్ & ఓపెన్ రెన్యూవబుల్ ఎనర్జీకై అడుగులు వేశామన్నారు. సోషల్ కేపిటల్గా అభివృద్ధి చేస్తూనే కంటికి కనబడని ప్రణాళికాబద్ధమైన లోతైన డీప్ డవలప్మెంట్స్ జరిగాయి, జరుగుతున్నాయని, కూడు-గుడ్డ-గూడు బదులుగాఈప్రభుత్వం 'విద్య-వైద్యం -ఉద్యోగం'లను ప్రవేశపెట్టి80% విద్యార్థులు ఏదో రూపంలో వినియోగించుకుంటున్నారని తెలిపారు.డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, వైస్-ఛాన్సలర్మాట్లాడుతూగవర్నమెంట్కిప్రత్యేకంగా జె.ఎన్.టి.యు.కె.కు జర్మనీతో చాలా ఎమ్.ఓ.యు.ల వలన ఉపయోగాలు చెప్పారు. 100మంది విద్యార్థులకు జర్మనీలో ఫైనల్ ఇయర్, ఆపై జాబ్కి అయ్యే ఖర్చు అంతా తామే 100% భరిస్తున్నామని అన్నారు. 'ఆదిత్య' శేషారెడ్డి మాట్లాడుతూ, తాను కేవలం తెలుగు మీడియంలో విలేజ్లో చదవడం వలన 3 ఇంటర్వ్యూలలోరిజెక్ట్అయ్యానని, ఇంగ్లీష్ మాట్లాడలేకపోవడమే విద్యార్థుల ఓటమికి ప్రధాన కారణమని, ఇంగ్లీష్ మీడియం చదువుల వలన మాత్రమే ప్రపంచమంతా మనదౌతుందని అన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్స్, గవర్నమెంట్ స్కూల్స్, పోర్టులలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ డవలప్మెంట్ అభివృద్ధి కాదా..? అని శేషారెడ్డి ప్రశ్నించారు. రైతు కుటుంబాలను ఆదుకోవడం, వ్యవసాయరంగంలో మార్పులను ఉదాహరణలతో, లెక్కలతో వివరించారు. రమణ చదువు ప్రయోజనాలను చెప్పారు. ప్రొఫెసర్ కె.ఎస్.ఎస్.జి. మురళీకృష్ణకో-ఆర్డినేట్ చేసి,ఓట్ఆఫ్థాంక్స్ చెప్పారు.ఆదిత్య, ప్రగతి, ఐడియల్, వి.ఎస్.ఎమ్. కాలేజి మరియు జె.ఎన్.టి.యు.కె. విద్యార్థినీ విద్యార్థులు సుమారు 450 మంది ఈ సెమినార్లో పాల్గొన్నారు.

# రజక ఆస్తులకు రక్షణ కల్పించాలి

**- వారికి ఉపాధి కల్పించి రుణాలు, పింఛన్లు ఇవ్వాలి**

**- రక్షణ చట్టం అమలు చేయాలి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా రజక వృత్తిదారులకు చెందిన ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని వాటికి రక్షణ కల్పించాలని,అలాగే రజకులకు ఉపాధి, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ఆరో జిల్లా మహాసభలు కాకినాడలోని సుందరయ్య భవనంలో శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు అధ్యక్షతన జరిగాయి.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు మాట్లాడుతూ రజకుల సమస్యలు పేరుకు పోయాయని, తమకు అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతగా వ్యవహరిస్తోందన్నారు. కుటుంబ పోషణ, ఉపాధి నిమిత్తం వేరే ప్రాంతాలకు వలస పోతున్నారని వాటిని అరికట్టాలని సూచించారు. రాష్ట్రంలో సుమారుగా 25 లక్షల రజక కుటుంబాలు ఉన్నాయని వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో బతుకుదెరువు చాలా కష్టతరంగా మారిందన్నారు. తమ హక్కుల కోసం, జీవోల అమలు కోసం ఉద్యమం చేయాలని కోనేటి రాజు పిలుపునిచ్చారు.

సంఘం రాష్ట్ర కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రజకులపై అనేక దురాగతాలు, రజక మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. వాటిని కాపాడవలసిన ప్రభుత్వ యంత్రాంగం మిన్నకుండి పోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రజకుల అభివృద్ధికి గతంలో ఫెడరేషన్ ఏర్పాటు చేసిందని దాన్ని ఇప్పుడు కార్పొరేషన్గా మార్చినా ఏ ఒక్కరికి రుణాలు అందించకపోగా ఉపాధి చూపించలేదన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లను నియమించినా వారు రుణాలు ఇప్పించిన దాఖలాలు లేకపోగా ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. దేవాదాయ, ఆసుపత్రి, జిల్లా ప్రభుత్వ కార్యాలయాలలో అనేక దోబీ పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని ఏమాత్రం భర్తీ చేయడానికి ప్రభుత్వం శ్రద్ధ వహించలేదన్నారు. రజకులు అభివృద్ధికి నిధులు కేటాయించకుండా ఉపయోగపడని కార్పొరేషన్ ఏర్పాటు చేయడం దండగన్నారు.

మనమంతా హక్కులను పోరాడి సాధించుకోవాలని భాస్కరయ్య పిలుపునిచ్చారు. ఏ నాయకులతోను సంబంధం లేకుండా, ప్రభుత్వాలకతీతంగా రజక హక్కుల నిమిత్తం ఉద్యమించాలని భాస్కరయ్య సూచించారు. అంతకుముందు రజక వృత్తిదారుల జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు మడక రాజు, రజక నాయకులు కాకినాడ రామారావు, కే.నాగేశ్వర రావు, కే.మాణిక్యం, ఎ.వి.డి. మెంటారావు, ఎం.ఈశ్వరరావు, గొల్తి సత్యనారాయణ, పోలేపల్లి నారాయణ, రాజు, చంటి, రాజశేఖర్, అజయ్, కే.రామకృష్ణ, చోడవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇనోదయ గ్రూప్లోకి వడ్డాది ఆదిత్య




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఇనోదయ హాస్పిటల్స్ బిజినెస్ డెవలప్మెంట్ అధికారిగా రొటేరియన్ వడ్డాది ఆదిత్య బాధ్యతలు స్వీకరించారు. ఇనోదయ మేనేజింగ్ డైరెక్టర్ డా॥ గొడవర్తి రామ్మోహన్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. వైద్యఆరోగ్య రంగంలో గత రెండు దశాబ్దాలుగా విశేష అనుభవం కలిగిన ఆదిత్య రోటరి గోల్డెన్ జూబ్లి క్లబ్ కార్యదర్శిగా విశేష సేవాకార్యక్రమాలు నిర్వహించి ప్లాటినమ్ ఉత్తమ కార్యదర్శిగా అవార్డ్ స్వీకరించారు. రోటరి వృద్ధాశ్రమ కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చేయూత ఫౌండేషన్ మెడికల్ టీమ్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ జె.సి.ఐ సభ్యునిగా సేవలందిస్తున్నారు. కాకినాడ అపోలో హాస్పిటల్స్లో దశాబ్దకాలం, సంజీవి హాస్పిటల్స్లో అర్ధదశాబ్దకాలం విశేష సేవలందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు ఉభయగోదావరి జిల్లాలలో రోగుల యోగక్షేమాలు ఎప్పటికప్పుడు పరిశీలించడమే కాక వైద్య సూచనలు సలహాలకు పలువురు ఆదిత్యను సంప్రదించడంతో పాటు పబ్లిక్ రిలేషన్స్ నిర్వహించడంలో విశేష అనుభవం కలిగిన వ్యక్తి. ఈ సందర్భంగా వడ్డాది ఆదిత్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య శిబిరాల నిర్వహణ ద్వారా ప్రజలలో అవగాహన కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు.

# ఏసీ పదోన్నతులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** దేవాదాయశాఖలో పనిచేస్తున్న జిల్లాకు చెందిన పలువురికి అసిస్టెంట్ కమిషనర్ పదోన్నతులు ఇచ్చారు. జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్గా, తొలి తిరుపతి కార్యనిర్వహణ అధికారిగా ఉన్న పులి నారాయణమూర్తికి ఏసీ ప్రమోషన్ ఇచ్చి పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయ ఈవోగా నియమించారు. పిఠాపురంలో పనిచేస్తున్న వడ్డి శ్రీనివాసరావును తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి దేవస్థానం ఈవోగా బదిలీ చేశారు. నారాయణమూర్తి జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్గా కూడా కొనసాగుతారు. సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయ ఈవోగా పనిచేస్తున్న నాగమల్లేశ్వరరావును బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్గా నియమించారు. లోవ దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న పెన్మత్స విశ్వనాథ రాజును అక్కడ ఇన్చార్జిగా కొనసాగిస్తూ ఆయనను అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్గా నియమించారు. కాకినాడ ఎం.ఎస్.ఎన్. చార్టీస్ ఈవో, సహాయ కమిషనర్గా అన్నదాన సమాజం ఈవోగా పనిచేస్తున్న ఆర్.వి. చందనను నియమించారు. అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తదితరులు కమిషనర్ రాము సత్యనారాయణను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పోలింగ్ బూత్ భవనాలు రిపేర్లు చేయించాలి



**- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రంపచోడవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్లలో మౌలిక సదుపాయాలు, కరెంటు, రన్నింగ్ వాటర్ సౌకర్యాలు మెరుగుపర్చాలని, భవనాలు రిపేర్లు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో శుక్రవారం రంపచోడవరం మండలానికి చెందిన సెక్టార్ అధికారులు, పోలింగ్ బూత్ అధికారులతో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్లలో సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్తోపాటు రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు సంబంధించిన ఫారం 6 మరియు 8 వారం లోపులో పెండింగ్ లేకుండా సమర్పించాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు జరిగే సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, అదేవిధంగా ఓటరు లిస్ట్ నుండి ఎవరి పేరైనా తొలగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సిబ్బందికి బిఎల్వో లు ఎప్పటికప్పుడు సహాయపడాలన్నారు. 17సి ఎన్నికల సరళిపై సెక్టర్ అధికారులకు, బూత్ స్థాయి అధికారులకు కలెక్టర్ వివరించడం జరిగింది. ఒక్కొక్క సెక్టార్ అధికారికి ఎన్ని పోలింగ్ బూత్లు ఉన్నాయి, ఆ రూట్లలో ఏ వాహనాలు కావాలో ఆయన అడిగి తెలుసుకున్నారు. సెక్టార్ అధికారులకు మెజిస్ట్రేట్ పవర్ ఉంటుందన్నారు. అన్ని మండలాలలో రిజర్వు ఈవీఎం లు అందుబాటులో ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్ పోలింగ్కు ముందురోజు సంబంధిత అధికారులకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రంపచోడవరం తాహసిల్దార్ ఎ.కృష్ణ జ్యోతి, సెక్టార్ అధికారులు, డిప్యూటీ తాహసిల్దార్లు యన్.వి.వి. సత్యనారాయణ, బి.రాజు. సుబ్బారావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ యం. విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరా బాయ్, టి.లక్ష్మణ్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం మారేడుమిల్లి మండలం జిఎంవలస గ్రామానికి చెందిన వికలాంగ గిరిజనుడు ముట్టెం శివ శంకర్ వరప్రసాద్ దొర వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. అదేవిధంగా వివిధ సమస్యలకు సంబంధించి దరఖాస్తుదారులు నుండి వినతిపత్రాలు స్వీకరించడం జరిగింది.

# ప్రభుత్వ కార్యక్రమాల బహిష్కరణ

**- జగన్మోహన్ రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరిక**

**- 9,10 తేదీలలో రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎనిమిదో తేదీ విజయవాడ ధర్నా సందర్భంగా ఆశా కార్యకర్తలపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి నిర్బంధాన్ని విధించడం పట్ల నిరసనగా 9, 10 తేదీలలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాయ్కాట్ చేస్తున్నామని నగర కార్యదర్శి మద్దెల భారతిప్రియ పిలుపునిచ్చారు. కాకినాడ అర్బన్ తాహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, బాలాచేరువు సెంటర్ మీదుగా మసీదు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, రామారావుపేట పి.హెచ్.సి. నాయకురాలు రెడ్డి సత్యవతి, కాకినాడ నగర కార్యదర్శి మద్దెల భారతి ప్రియ మాట్లాడుతూ విజయవాడ కార్యక్రమానికి ఒకరోజు ముందే ఉదయం 7 గంటల నుండి సచివాలయ మహిళా పోలీసుల ద్వారా ఆశా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పిల్లల ముందు, భర్తల ముందు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించి అర్ధరాత్రి 11 గంటల వరకు పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26,000 చెల్లించాలని శాంతియుత ఆందోళనకు కూడా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనుమతించడం లేదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మహిళలని కూడా చూడకుండా పురుష పోలీసులు ద్వారా నిర్బంధాన్ని ప్రయోగించి జగన్మోహన్ రెడ్డి తన నిజ స్వరూపాన్ని బయట పెట్టుకున్నాడని విమర్శించారు. మహిళా సాధికారత అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో రాష్ట్ర ప్రజానీకానికి ప్రాణాలకు తెగించి సేవలు చేసినందుకు జగన్ ప్రభుత్వం పోలీసులతో చేసిన సత్కారానికి రాబోయే ఎన్నికల్లో రుణం తీర్చుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి, నిర్మల, సత్యవేణి, రాణి, లక్ష్మీనరసమ్మ, కుమారి, ఊర్మిళ, అరుణ, మల్లీశ్వరి, పాప, కృపావతి, జ్యోతి, పుష్ప, చెక్కల వేణి, మలకా నాగలక్ష్మి, పద్మావతి, గమ్య తదితరులు పాల్గొన్నారు.

# చొల్లంగి అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ ఫ్లైయిఓవర్ బ్రిడ్జి క్రింద గల శ్రీ గాటీలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ విజయగణపతి స్వామివారి ఆలయంలో చొల్లంగి అమావస్యను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు శాస్త్రోక్తంగా జరిపించారు. అందులో భాగంగా ఆలయం వద్ద ప్రముఖ దంతవైద్యులు డా. కృష్ణమోహన్ తన తండ్రి కోకా కృపాసాగర్ జ్ఞాపకార్ధం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.తొలుత విజయగణపతి ఆలయ వ్యవస్థాపకులు తలాటం హరీష్, దంత వైద్యులు డా. కృష్ణమోహన్ లు స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిధి దంత వైద్యులు డా. కృష్ణ మోహన్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా తలాటం హరీష్ మాట్లాడుతూ చొల్లంగి అమావాస్యను పురస్క రించుకుని ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించిన డా. కృష్ణమోహన్ అభినందనీయులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మంచి శారీరక ఆరోగ్యం కోసం మన దంతాలను సంరక్షించుకోవాలి

**- డా. అద్దాల**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నోటి ఆరోగ్యం మొత్తం శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉన్నందున దంతాలను సంరక్షించుకోవాలని డాక్టర్ అద్దాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్లో బోటు క్లబ్ వాకర్స్ సంగం మరియు కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో జాతీయ పంటి నొప్పి నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నోటి శుభ్రత పాటించడం వలన సహజ దంతాలను కాపాడుకోవచ్చని అన్నారు. నోటిలో ఉండే బ్యాక్టీరియా రక్త ప్రవాహంలోకి ప్రవేశిస్తే మధుమేహం, గుండె జబ్బులు, వంటి దీర్ఘకాలిక రోగాలు రావడానికి నోటి అపరిశుభ్రత కూడా కారణమని అన్నారు. దీని నివారణకు గాను రోజుకు రెండు పూటలా దంతాలను శుభ్రపరచుకోవాలని అన్నారు. ఆహారం తీసుకున్న తర్వాత నీటితో నోటిని పుక్కిలించుకోవాలని డాక్టర్ అద్దాల తెలిపారు. జాతీయ పంటి నొప్పి దినోత్సవం పంటి నొప్పులను నివారించడం మరియు మంచి నోటి పరిశుభ్రతను నిర్వహించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందని,అసౌకర్యం మరియు సంభావ్య ఆరోగ్య సమస్యలను నివారించడానికి మన దంతాలు మరియు చిగుళ్ళను ఎలా చూసుకోవాలో మరింత తెలుసుకునే అవకాశాన్ని అందిస్తుందని అన్నారు. జాతీయ పంటి నొప్పి దినోత్సవం పంటి నొప్పుల సంభవనీయతను తగ్గించడం మరియు ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన, సంతోషకరమైన చిరునవ్వును అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నది అని అన్నారు.ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ 'పల్లెకు పోదాం'



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమం పథకాలన్నిటి గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇంచార్జ్ కొల్లి సూర్యారావు అన్నారు. మండలంలో, మండలం బీజేపీ ఇంచార్జ్ కముజు శ్రీను అధ్వర్యంలో, పల్లెకుపోదాం కార్యక్రమ మండల బాధ్యులు గుంటూరి సత్యవర్మ నాయకత్వంలో మండలంలోని పసుపల్లి, ముక్కామల, వక్కలంక, కాముజు వారిలంక గ్రామాలలో బీజేపీ 'పల్లెకుపోదాం' కార్యక్రమం చేట్టారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమం పథకాలన్నిటిని వివరించారు. 'కేంద్రంలో మరోసారి -రాష్ట్రంలో ఒక్కసారి బీజేపీ సర్కార్' కు అవకాశం ఇవ్వాలని ప్రజల మద్దతు కోరారు. ఈ కార్యక్రమములో అప్పన గణపతిరావు, గుత్తుల సత్య నారాయణమూర్తి, శ్రీకాకులపు పవన్, మద్దుల రామసూర్య నారాయణ, గొల్ల రాము, మల్లేపల్లి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
శనివారం
10 ఫిబ్రవరి 2024



# అల్బెండజోల్ మాత్రల పంపిణీ



అల్లవరం, మేజర్ న్యూస్ : బోడసకుర్రు హైస్కూల్ వద్ద గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి సమక్షంలో హెల్త్ సిబ్బంది జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ స్కూల్ మరియు శిష్ట అప్పలస్వామి మెమోరియల్ జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ & స్టాఫ్, పాలకవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, అంగన్వాడీ సిబ్బంది, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ పిడిగా సత్యనారాయణ



కాకినాడ, మేజర్ న్యూస్ : హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్గా ఎన్.వి.వి. సత్యనారాయణ నియమితులయ్యారు. కాకినాడలో జిల్లా పరిషత్ సీఈఓ గా పనిచేస్తున్న కాకినాడ సత్యనారాయణను ఆర్డీవో గా బదిలీ చేశారు. కొద్ది కాలానికి బదిలీ అయింది. తొలుత పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈవోగా బదిలీ చేశారు. అక్కడ జాయిన్ కాకముందే కాకినాడలో పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ గా నియమించారు. కానీ ఆ పోస్టింగ్ దక్కలేదు. దీంతో మూడు నెలల పాటు సెలవులో ఉన్నారు. తాజా బదిలీల్లో ఆయనను హౌసింగ్ పీడీగా బదిలీ చేశారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి జాయినింగ్ ఆర్డర్ ఇచ్చారు. జిల్లా పరిషత్ సీఈవోగా, కాకినాడ ఆర్డీవోగా మంచి గుర్తింపు పొందారు. గృహ నిర్మాణశాఖ నూతన ప్రాజెక్ట్ డైరెక్టర్ గా నియమితులైన సత్యనారాయణను ఆ శాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

# వైకాపాను గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధమే



కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రజలకు, వ్యాపారస్తులకు ఇబ్బంది కలిగించే పాలన ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలంతా సిద్ధమేనని కాకినాడ సిటీ జనసేన పార్టీ ఇన్చార్జ్ ముత్తా శశిధర్ అన్నారు. నివాస యోగ్యమైన కాకినాడ నగరాన్ని ప్రజలు స్థిర నివాసానికి పనికిరాకుండా చేయడంలో కుట్రలో భాగంగానే వైకాపా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సుమారు 28 వేల మందిని నగర బహిష్కరణ చేసే ఇళ్ళ స్థలాల పేరుతో ఊరు దాటించారని ముత్తా శశిధర్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక మెయిన్ రోడ్డు సూపర్ బజార్ వద్ద జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి శివ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్తా శశిధర్ మాట్లాడుతూ కాకినాడ నగరంలో పన్నులు పేరుతో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే ద్వారంపూడి పరోక్ష పద్ధతిలో పీడిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార, వాణిజ్యపర సంస్థలకు ఇష్టారీతిన పన్నులు పెంచడమే కాకుండా ప్రతి సంవత్సరం ఆస్తి పై పన్ను శాతాన్ని 15 శాతం పెంచడం దారుణం అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం ఏప్రియల్ 1,వ తేదీ లోపు పన్నులు చెల్లింపు చేయకపోతే దానికి 2 శాతం పన్ను పై వడ్డీ వసూలు చేయడం రాష్ట్రంలో కాకినాడ నగరంలో మాత్రమే చూస్తున్నామని ఆరోపించారు. ప్రజలకు, వ్యాపారస్తులకు ఇబ్బంది కలిగించే పాలన ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు మేము సిద్ధమే అన్నారు. జన సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి శివ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఆస్తిపన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇంటి పన్నులు వసూలు భరించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారని వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఇదే విధానంగా ప్రజలను దోచికిని గురి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆగడాలు అక్రమాలు ప్రజలకు తెలిసే విధంగా జనసేన పార్టీ పీఏసీ సభ్యులు కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వైకాపా ప్రభుత్వాన్ని సాగనంపి జనసేన పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, సిటీ ఉపాధ్యక్షుడు సత్యన్నారాయణ, జనసేన నాయకులు ఆకుల శ్రీనివాస్, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, చీకట్ల శ్రీనివాస్, మనోహర్లాల్ గుప్తా, అడబాల రాజేంద్రప్రసాద్, మిరియాల హైమావతి తదితరులు ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోపాటు శరీర శుభ్రత అవసరం

– గొంగడి వెంకటరామిరెడ్డి



ఎటపాక, మేజర్ న్యూస్ : మన చుట్టూ వున్నా పరిసరాల పరిశుభ్రత తోపాటు శరీర శుభ్రత చాలా అవసరం అని గుండాల ఎంపీటీసీ గొంగిడి వెంకట రామిరెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామపంచాయతీ పరిధిలో గల సెయింట్ ఆన్స్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందును పంపిణీ చేయడం జరిగింది. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుండాల ఎంపిటిసి గొంగిడి వెంకటరామిరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు మరియు బాలల యొక్క కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారు.శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని, అల్బెండజోల్ 400 మిల్లీగ్రామ్స్ మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించుకోవచ్చు అని తెలిపారు. ప్రతిరోజు రెండు పూటలా స్నానం చేసి, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని లేకపోతే అపరిశుభ్రత వల్ల ఈ నులిపురుగులు సంక్రమిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ దివ్య, మెడికల్ సిహెచ్ఓ లక్ష్మి మరియు మెడికల్ సిబ్బంది, సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## చెరువు అభివృద్ధి పనులపై సూచనలు



అల్లవరం, మేజర్ న్యూస్ : కొమరగిరిపట్నం గ్రామపంచాయితీ పరిధి వెంకన్న చెరువు ఏరియా నందు ఉన్న పిడబ్ల్యూఎస్ చెరువు అభివృద్ధి చేయు పనులలో భాగంగా జల జీవన్ మిషన్ నందు గ్రాంటు మంజూరు కాబడినందున శుక్రవారం ఆర్డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి మరియు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్థసారధి చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధి విషయమై తగు సూచనలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో అల్లవరం ఎంపిపి ఇళ్ల శేషారావు, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, అల్లవరం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ స్వామి, కొమరగిరిపట్నం గ్రామపంచాయితీ సర్పంచ్ మరియు పంచాయితీ కార్యదర్శి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ కమిటీ నాయకులు హాజరు కావటం జరిగినది.

## ఏజెన్సీ గ్రామాల్లో వయోజన విద్యా కార్యక్రమాలు



రంపచోడవరం, మేజర్ న్యూస్ : మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రంపచోడవరం ఏజెన్సీ గ్రామాల్లో వయోజన విద్యా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ గెద్దం గడ్డెమ్మ పేర్కొన్నారు. మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ గడ్డెమ్మ ఆధ్వర్యంలో ఏజెన్సీ గ్రామాల్లో నిరక్షరాస్యత నిర్మూలించుటకు వయోజన విద్యా కేంద్రాలు నడుపుటకు 30 మంది టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని రంపచోడవరం ఆర్కా రిసార్ట్స్లో ఈనెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు రిసోర్స్ పర్సన్ జాన్సన్ సహకారంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య విచ్చేసి శిక్షణ పొందిన వయోజన విద్య ఉపాధ్యాయులందరికి సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనవంతు సాయంగా వయోజన విద్యా కేంద్రాలు నిర్వహించుటకు పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమాలు మాస్ సంస్థ ఆర్డబ్ల్యూఎల్ వారి సహకారంతో ఒక సంవత్సరం పాటు నడిపిస్తామని నిర్వాహకులు సుధాకర్ పేర్కొన్నారు.

## ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ఎన్నికల గారడీనే

- అయిదేళ్ళు కావస్తున్నా మూడు అంకెలు దాటని పేదల ఇళ్ల నిర్మాణం
- మీ జిమ్మిక్కులకు ప్రజలు మోసపోయే రోజులు పోయాయి
- రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ఎన్నికలు దగ్గర పడటంతో ఇళ్ల రిజిస్ట్రేషన్ పేరుతో ప్రజలను మోసం చేసే విధంగా వైసీపీ ఎన్నికల గారడీ చేస్తుందని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉచ్చిలి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అయిదేళ్ళు కావస్తున్నా మూడు అంకెల ఇళ్లు కూడా కట్టలేకపోయారని ఆరోపించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి తగు సహాయం అందిస్తే పేదలు ఇళ్లు నిర్మించుకుని వుండేవారని అన్నారు. సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా చేసి దోచుకునే విధంగా ఇసుక విధానాన్ని జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కూడా ఇలానే పట్టాలు ఇచ్చి ఎన్నికల జిమ్మిక్కులు చేసి ఓట్లు దండుకున్నారని, మరలా సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడటంతో ఇప్పుడు స్థలాల పొజిషన్ చూపించకుండా, ఎక్కవున్నాయో తెలియని స్థలాలకు రిజిస్ట్రేషన్ చేస్తామని, చేయించుకోకపోతే మీకు స్థలాలు రావని మభ్యబెట్టి ఎన్నికల గారడీ చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జగన్ అసమర్థ పాలన ఏంటో ప్రజలకు అర్థమైందని ఎక్కడ ఉన్నాయో తెలియని స్థలాలకు పట్టాలు, వాటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంటే మరలా మోసపోయేందుకు ప్రజలు సిద్దంగా లేరని, జగన్మోహనరెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు సంసిద్ధంగా వున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ తోటకూర సుబ్బరాజు, ఆ మండల గ్రామ తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

## నిర్బంధానికి నిరసనగా ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరించిన ఆశా వర్కర్లు



– 9, 10 తేదీలలో రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : ఎనిమిదో తేదీ విజయవాడ ధర్నా సందర్భంగా ఆశా కార్యకర్తలపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి నిర్బంధాన్ని విధించడం పట్ల నిరసనగా 9, 10 తేదీలలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాయ్కాట్ చేస్తున్నామన్నారు. కాకినాడ రూరల్ తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు కాకినాడ రూరల్ కార్యదర్శి టి.రాజా, పండూరు పి.హెచ్.సి. నాయకురాలు మొగలి బేబీ, తూరంగి పి.హెచ్.సి. నాయకురాలు విమలాదేవి మాట్లాడుతూ విజయవాడ కార్యక్రమానికి ఒకరోజు ముందే ఉదయం 7 గంటల నుండి సచివాలయ మహిళా పోలీసుల ద్వారా ఆశా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పిల్లల ముందు, భర్తల ముందు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించి అర్ధరాత్రి 11 గంటల వరకు పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26,000 చెల్లించాలని శాంతియుత ఆందోళనకు కూడా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనుమతించడం లేదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మహిళలని కూడా చూడకుండా పురుష పోలీసులు ద్వారా నిర్బంధాన్ని ప్రయోగించి జగన్మోహన్ రెడ్డి తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నాడని విమర్శించారు. మహిళా సాధికారత అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో రాష్ట్ర ప్రజానీకానికి ప్రాణాలకు తెగించి సేవలు చేసినందుకు జగన్ ప్రభుత్వం పోలీసులతో చేసిన సత్కారానికి రాబోయే ఎన్నికల్లో రుణం తీర్చుకుంటామని తెలిపారు. ఆశా వర్కర్స్ యూనియన్ ధర్నాకు ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.హెచ్. రమణి, భవాని, సిఐటియు కాకినాడ రూరల్ నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, సిపిఎం కాకినాడ రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేష్మ, సుబ్బలక్ష్మి, కుమారి, నాగలక్ష్మి, పావని, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్సిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

– పెద్దగెద్దాడ ఆసుపత్రి సందర్శించిన జిల్లా కలెక్టర్



రంపచోడవరం, మేజర్ న్యూస్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, ఆయా వ్యాధులకు మందులు ఇవ్వాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. రంపచోడవరం మండలం పెద గెద్దాడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పరిశీలించడం జరిగింది. ఆస్పత్రికి ప్రతీరోజు ఎంతమంది రోగులు వస్తున్నారు, అదేవిధంగా వచ్చిన రోగులకు ఏ విధంగా రక్తపరీక్షలు చేస్తున్నారో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది సిబ్బంది ఉన్నది, అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి, ఎంతమంది జనాభా ఉన్నది ఆయన ఆరా తీశారు. ఈ ఆస్పత్రికి వచ్చే రోగులకు కావలసిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. అదేవిధంగా రక్త పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారో ఆయన పరిశీలించడం జరిగింది. అనంతరం పెద్దగెద్దాడలో హైస్కూల్ పరిశీలించి స్కూల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నది, ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాలకు అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. అదేవిధంగా బాగా చదివే విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ బుక్స్ విద్యకు సంబంధించిన పుస్తకాలు కలెక్టర్ విద్యార్థులకు అందజేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ వెంట ఎంపీపీ బంధం శ్రీదేవి, పెదగెద్దాడ సర్పంచ్ వి.ప్రసాద్, ఏడిఎం అండ్ హెచ్ఓ జి.ప్రకాశం, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ కార్డ్స్ 100 శాతం పంపిణీ చేయండి - ఎంపిడిఓ



అల్లవరం, మేజర్ న్యూస్ : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ కృష్ణ మోహన్ మాట్లాడుతూ మండలంలో 23 సచివాలయాల పరిధిలో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డ్స్ వంద శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా గ్రామాల్లో పారిశుధ్యం, రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కునేలా సమ్మర్ ఏక్షన్ ప్లాన్, ప్రాధాన్యతా భవనాలు, హౌసింగ్పై సచివాలయం వారీగా ఎంపిడిఓ పురోగతిని సమీక్షించడం జరిగింది. స్థలాల రిజిస్ట్రేషన్, కులగణన, ఆరోగ్యశ్రీ స్మార్ట్ పంపిణీలో అల్లవరం మండలంను జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచడంలో సహకరించిన కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ను ఎంపిడిఓ స్వయంగా అభినందించారు. ఈ సమావేశంలో ఈఓఆర్డీ ఎన్.వి.సత్య నారయణ, ఎపిఎం సయిద్, కార్యదర్శులు శ్రీనివాస్, రాజ్ మోహన్, రాజా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు




రంపచోడవరం, మేజర్ న్యూస్ : పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని రాష్ట్ర ప్రభుత్వంపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతి రాజు ధ్వజమెత్తారు. ఫిబ్రవరి 8వ తేదీన ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శాంతియుతంగా విజయవాడలో ధర్నా చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ (సిఐటియు) పిలుపు మేరకు విజయవాడ వెళ్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులను ఎక్కడికక్కడ పోలీసులను ప్రయోగించి అక్రమంగా నిర్బంధాలు, అరెస్టులు చేయడాన్ని శాంతిరాజు ఖండించారు. వై.రామవరం మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ మండల నాయకులు కె వరలక్ష్మి అధ్యక్షతన ర్యాలీ నిర్వహించి, వై.రామవరం మెయిన్ సెంటర్లో మానవహారం చేసి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతి రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో భాగంగా ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు మేరకు సమస్యల పరిష్కారం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి వెళుతున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులను అక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై పోలీసులను ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేయడం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయడం చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. ఇటువంటి నిర్బంధాలతో ఆశా వర్కర్లను భయపెట్టి ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఇచ్చిన హామీలు తక్షణమే పరిష్కారం చేయాలని, పరిష్కారం చేయకపోతే ఆశా వర్కర్ల సత్తా ఏంటో చూపిస్తామని, రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు గడుతూరి మల్లికార్జున రావు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు కె వీరలక్ష్మి, మొల్ల నూకరత్నం, రోలుపల్లి శ్యామల, పల్లాల పండమ్మ, గంగమ్మ, జె తులసమ్మ, గడుతూరి అనసూయ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# నిధులు తెస్తారా..!

-ఎన్నికల వేళ నిధులు పరిస్థితి ఏంటీ..?



వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి,కేంద్ర పర్యటన(ఢిల్లీ) విజయవంతం,నిధులు వస్తాయా!ఇస్తారా!తెస్తారా!ఎన్నికల వేళ పరిస్థితి ఏంటీ,నిధులు ఇస్తే పోలవరం ప్రాజెక్టుకు, కొంతలో కొంతైనా వెలుసుబాటు కలిగే ప్రయోజనాలు లేకపోలేదు.పోలవరం నిధులే కాదు,రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేస్తే కనీసం రోడ్లు బాగుపతాయనే భావన కలుగుతుంది.పోలవరం నిర్వాసితులకు,సర్వేలు తప్ప, ఎక్కడా ఆర్&ఆర్ కానీ భూములకు,కానీ ఇళ్ళకు కానీ, ఎక్కడా ప్యాకేజి ఇచ్చిన దాఖలాలు లేవు.కేంద్రం ఇవ్వదు,రాష్ట్రం పెట్టదు,మరి నిర్వాసితుల పరిస్థితి ఏంటీ,పోరాడే పార్టీలను ప్రజలు ఆదరించిన నాడే పోలవరం నిర్వాసితులకు సరైన న్యాయం జరుగుతుందని,మేధావి వర్గం అభిప్రాయపడుతున్నారు.ఏది ఏమైనా నిధులు రావాలంటే కేంద్రంలో మిశ్రమ ఫలితాలు రావాలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్లమెంట్ సభ్యుల సహకారం కేంద్రానికి కలిగితే పరిస్థితి వేరే రకంగా ఉంటుందేమో చూడాలి..?

## సమగ్ర భూ సర్వేని పరిశీలించిన ఆర్డీవో



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : శుక్రవారం మెర్లపాలెం నార్కెడిమిల్లి గ్రామములలో ప్రభత్వ సమగ్ర భూ సర్వే పనులలో భాగముగా సర్వే రాళ్ళు ప్లాంటేషన్ పనులను కొత్తపేట ఆర్డిఓ జి.వి.వి. సత్యనారాయణ పరిశీలించి, తగు సూచనలు జారీ చేశారు. అనంతరం ర్యాలి గ్రామములో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న 8 పోలింగ్ కేంద్రములను సందర్శించి, తాగు నీరు, ర్యాంప్, విద్యుత్ సదుపాయం వంటి మౌలిక సదుపాయములను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. తహశీల్దార్ కార్యాలయం నందు ఎన్నికల నియమావళిని అనుసరించి సెక్టారల్ అధికారులతోనూ, బూత్ లెవెల్ అధికారులతోను సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో గల సమస్యలపై కూలంకషముగ పరిశీలించి, తగు నివేదికలు సమర్పించవల్సినదిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భవాని తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు



అంబాజీపేట, మేజర్ న్యూస్ : ముమ్మిడివరం టిడిపి ఇన్ చార్జ్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పుట్టినరోజు వేడుకలు ముమ్మిడి వరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు హాజరయ్యారు. దాట్ల బుచ్చిబాబును టిడిపి నాయకులు ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సంచార జాతుల ఎంబీసీ డైరెక్టర్ యడ్లపల్లి తుక్కియ్య, ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య, ముక్కామల మాజీ ఎంపీటీసీ ధనికొండ శ్రీను, మోకా శ్రీను, సంచార జాతుల నాయకుడు దనికొండ నల్లయ్య, మాజీ సర్పంచ్ చెయ్యేటి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
శనివారం
10 ఫిబ్రవరి 2024



## తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్ల నిరసన



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబాజీపేట మండలంలో గల ఆశా వర్కర్లు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని సిఐటియు మండల కార్యదర్శి బి.ఎస్తేరాణి అధ్వర్యంలో నిరసన చేపట్టారు. తమ న్యాయమైన కోర్కెల కొరకు నిరసన చేపట్టిన మా ఆశా వర్కర్లను అరెస్ట్ చేసారని వారిని విడిచి పెట్టాలని, అలాగే కనీస వేతనం ఇవ్వాలని, పని భారాన్ని తగ్గించాలని, పది లక్షలు (గ్రూప్ ఇన్సూరెన్సు కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఐదు లక్షలు, ప్రభుత్వ సెలవులు, మెడికల్ సెలవులు వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు అమలు చేయాలని, ఇల్లు లేనివారికి ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేసారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ చేయూత పండుగకు సమాయత్తం అవ్వాలి - ఎంపిడిఓ



**అల్లవరం, మేజర్ న్యూస్ :** స్థానిక డ్వాక్రా కార్యాలయంలో శుక్రవారం వివోఏ లకు వైఎస్ఆర్ చేయూత 4వ విడత పంపిణీ నిమిత్తం ఏర్పాట్లు పై ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ నెలలో అల్లవరంలో నిర్వహించే వైఎస్ఆర్ చేయూత 4వ విడత పంపిణీ నిమిత్తం సమాయత్తం కావాలని, గ్రూప్స్ వారీగా లబ్దిదారులను సిద్దం చేయాలని ఆదేశించారు. లోకోస్ యాప్ లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఎం సయ్యిద్, ఈవోఆర్‌డి ఎన్.వి.సత్య నారాయణ, డ్వాక్రా వివోఏలు పాల్గొన్నారు.

# హస్తం గుర్తు మన రాష్ట్రానికి అభయ హస్తం

**కొవ్వూరు,మేజర్ న్యూస్ :** కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని హస్తం గుర్తు మన రాష్ట్రానికి అభయ హస్తం అని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని వైయస్ షర్మిల చాగల్లు గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పిలుపునిచ్చారు. కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు గ్రామంలో శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల పాల్గొని ప్రజల నుండి పలు వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజల నుండి సమస్యలు తెలుసుకుని ఈ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. రచ్చబండ కార్యక్రమంలో పింఛన్లు, ఇళ్ల స్థలాలు, దళితులపై జరుగుతున్న దాడులతో పాటు వివిధ సమస్యలను ప్రజలు షర్మిల దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా వైయస్ షర్మిల మాట్లాడుతూ రచ్చబండ ద్వారా వచ్చిన సమస్యలు అధికార పక్షానికి తెలియాలన్నారు. జగన్మోహన్ రెడ్డి పథకాలు ఒక చేత్తో ఇస్తూ మరో చేత్తో గుంజుకునేలా ఉన్నాయని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అధికారంలో ఉండి రాహుల్ గాంధీ చేసే మొట్టమొదటి సంతకం మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించేదని అన్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని ప్రకటిస్తానని 25 వేలు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం గెలిచిన తర్వాత ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రంలో దళితుల మీద దాడులు జరుగుతున్నాయని, సుమారు 60 మంది దళితుల పైన వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారని అన్నారు . కొవ్వూరు నియోజవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత దళిత మంత్రి అయి ఉండి కూడా రాష్ట్రంలో కనీసం నియోజకవర్గంలోని దళితులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. దళిత మంత్రి అయ్యుండి దళితులపై దాడులు నిలువరించలేకపోయారని వెంటనే హోం మంత్రి తానేటి వనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మద్యపాన నిషేధం పెట్టిన తర్వాతనే ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ ఆ మాట మరచి చివరకు ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేస్తూ దోచుకుంటుందని అన్నారు. ఇంతవరకు చాగల్లు షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు తెరవలేదని షర్మిల ప్రశ్నించారు. మట్టి బిందులు ఇచ్చి వెండి బిందెలను ఎత్తుకుని పోతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డి ఇద్దరూ బిజెపి బానిసలని వారి స్వార్ధ ప్రయోజనాల కొరకు బిజెపి దగ్గర రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని అన్నారు. బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి హోదా ఇవ్వకపోగా పోలవరం ప్రాజెక్టు నిధులను కూడా ఆపివేసిందని అన్నారు.గత పది సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం రాష్ట్రాన్ని మోసం చేస్తుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, వైసిపి లకు ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్లేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం బాగుపడుతుందని హస్తం గుర్తు మన రాష్ట్రానికి ఒక అభయ హస్తమని అన్నారు. కాంగ్రెస్ తోనే మన రాష్ట్రానికి హోదా తో పాటు పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని అలాగే రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. రాజన్న రాజ్యం కాంగ్రెస్ తోనే సాధ్యమని అన్నారు.



ప్రజల మనిషి ముఖ్యమంత్రిగా అద్భుతమైన పరిపాలన కొనసాగించిన వ్యక్తిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. ఏ విధమైన ప్రలోభాలకు లొంగకుండా రాష్ట్ర భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని షర్మిల విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘువీరారెడ్డి, జెడి శీలం, గిడుగు రుద్రరాజు, అమర్జహ బేగ్, సుంకర పద్మశ్రీ, అరిగెల అరుణ కుమారి, ఎండి రఫీ ఉల్లా బేగ్, గంధం పూజ నరసింహ బాపూజీ, గెద్దం సాయిబాబా కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాత్విక జీవన విధానం మానవుడికి ఎంతో అవసరం

**– పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** దైనందిన జీవితంలో మానవుడికి తాత్విక జీవన విధానం ఎంతో అవసరం అని పీఠా ధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో 3 రోజులు పాటు జరిగే పీఠం 96వ వార్షిక మహా జ్ఞాన సభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో పీఠాధిపతి సభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలీషా మాట్లాడుతూ తన జీవన పయనంలో అనేక ఒత్తిడులు, సందేహాలు, అలజడి, అశాంతి, సమస్య లతో జీవన వ్యవస్థను అస్తవ్యస్తం చేసుకుంటున్న మానవుడు తన మన స్సును ఆధ్యాత్మికపరమైన కోణంలో తీర్చి దిద్దుకోగలిగినట్లైతే వాటిన్నింటిని పరిష్క రించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. తాత్విక జీవన విధానం. ఈనాటి మానవాళికి ఎంతో అవసరం అని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. సభకు ముఖ్య అతిథులుగా... ప్రముఖ సాహితీ వేత్త బేతవోలు రామ బ్రహ్మం, రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయ ఆచార్య ఎ. సచ్చిదానంద మూర్తి, పిఠాపురం మాజీ శాసనసభ్యులు ఎస్ వి ఎస్ ఎన్ వర్మ, పట్టణ సీఐ శ్రీనివాసు, ఉమర్ ఆలీషా సాహితీ సమితి అధ్యక్షులు త్సవటపల్లి మురళీకృష్ణ, కార్యదర్శి దాయన సురేష్ చంద్రజి, భవర్ లాల్ జైన్ తదితరులు పీఠాధిపతిని దర్శించుకున్నారు. సభలో నిర్వహించిన సంగీత విభావరిలో ఎ. ఉమ, ఐ. ఉమ, ముకుంద్ ప్రవీణ్ ఆలపించిన కీర్తనలు సభికులను రంజింపచేసాయి. సభలో పాల్గొనడానికి దేశ, విదేశాలనుండి విచ్చేసిన సభ్యులకు ఆశ్రమం వద్ద ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా 351 మంది నూతనంగా మంత్రోప దేశం పొందారు. ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న కార్మికశాఖ మంత్రి జయరాం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం శుక్రవారం ఉదయం లేబర్ మినిస్టర్ గుమ్మనూరి జయరాం శ్రీ సత్యదేవుని సన్నిధికి విచ్చేశారు. ఆయనకు దామెర కృష్ణారావు ఆలయమర్యాదలతో ఘనస్వాగతం పలికారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, అర్చకుడు ఇంద్రగంటి సుధీర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ ఏఈఓ దామెర వెంకట కృష్ణారావు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణ ప్రసాద్, దేవస్థానం అధికారులు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేసిన ఎంపీపీ వెంకటలక్ష్మి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** జాతీయ నులు పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారులు సుష్మా, ఎం.నాగార్జునల ఆధ్వర్యంలో రాజవొమ్మంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఏపీ జూనియర్ కళాశాల విద్యార్థులకు, లాగరాయి పీహెచ్సీ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రల ను పంపిణీ చేశారు. జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యులు యామిని ప్రియా, జి ఎస్ వి.నాగార్జున ఆధ్వర్యంలో 40 పాఠశాలలలో విద్యార్థులకు, 40 అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలందరికి చేతులు శుభ్రపరచుకోవడం పై అవగాహనా కల్పించి, ఆల్బండా జోలు మాత్రల యొక్క ఉపయోగం గురించి తెలియ జేయుట జరిగింది. పీహెచ్ పరిధిలో 2666 మంది పిల్లలకు గాను 2399 మందికి మాత్రలు వేయడం జరిగింది.

## ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రథమ చికిత్సపై శిక్షణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్ క్రాస్ వింగ్ ఆధ్వర్యంలో కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ వారిచే ప్రథమ చికిత్సపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ప్రమాద సంఘటన స్థలం నుండి బాధితుడిని వైద్యుడి దగ్గరకు చేరవేసే లోపల చేయు ప్రథమ చికిత్స పై అవగాహన ప్రతి ఒక్కరికి అవసరం. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రథమ చికిత్స పై శిక్షణ అందించారు. యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఫీల్డ్ ఆఫీసర్ మల్లేశ్వరరావు విద్యార్థులకు శిక్షణ అందించారు. ఈ శిక్షణలో సి పి ఆర్, చోకింగ్, కట్లు కట్టడం, ప్రమాద స్థలం నుండి బాధితులను తరలించే విధానం, విద్యుత్, అగ్ని ప్రమాదాల వంటివి సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రాథమిక ప్రథమ చికిత్సలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణకు రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన మల్లేశ్వర రావు ను డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన యూత్ రెడ్ క్రాస్ వింగ్ విభాగాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్, డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, ఐఆర్సిఎస్ నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పి ఓ దివాకర రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 13వ డివిజన్‌లో జనసేన 'మేము సిద్ధం' కార్యక్రమం



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ్ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో 13వ డివిజన్ సాంబమూర్తినగర్లో పాలిక శివ ఆధ్వర్యంలో శుక్రవారం మేము సిద్ధం కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ వెయ్యికోట్ల స్మార్ట్ సిటి నిధులతో అభివృద్ధి పనులు చేసి అద్భుతాలు చేసామని అధికారపార్టీ వాళ్ళు చెప్పుకుంటున్నారనీ మరి ఇక్కడున్న దివ్యాంగులు కంటి చూపులో ఇబ్బందులతో తాత్కాలిక భవనంలో ఉంటున్నారనీ వీరికి ఉన్న సదుపాయాలు ఏంటో పరిశీలించారా అని ప్రశ్నించారు. కాకినాడ నగరంలో చాలా భూములు కబ్జాలకు గురయ్యాయనీ, కొన్ని చోట్ల అభివృద్ధి కోసమని చెపుతూ భూములు లేవని ప్రయివేటు భూములు తీసుకుని టి.డి.ఆర్. బాండ్లు ఇచ్చరనీ కానీ ప్రభుత్వ భూములు ఇలాంటి అవసరాలకు వాడుకోవచ్చని గుర్తించకపోడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో పలు ప్రాంతాలనుండీ ఇక్కడ దివ్యాంగులు ఉంటున్నారనీ, వారికి ఎప్పటినుండో ఇస్తున్న మూడువేల రూపాయలు తప్ప పెరగలేదనీ, కాస్మటిక్ చార్జీలకింద రూ.150 లు తప్ప రాదనీ దీనితో వీరు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మానవతా దృక్పధానికి అధికారం తోడైతే అద్భుతాలు జరుగుతాయని నిన్న పవన్ కళ్యాణ్ చెప్పింది వీరికి తెలియచేయడానికి వచ్చామని, జనసేనపార్టీ కాకినాడలో వీరందరికీ మంచి వసతులతో భవనాన్ని ఏర్పాటు చేసి మెరుగైన జీవనాన్ని ఇచ్చేందుకు మేము సిద్ధం అని తెలియచేయడానికి ఇక్కడికి వచ్చామని తెలిపారు. వీరికి ఉద్యోగం వచ్చేవరకు ఉపాధి కలిపించే బాధ్యత జనసేన పార్టీ తీసుకుంటాదని చెప్పేందుకు మేము సిద్ధం అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమ్యుక్త కార్యదర్శి వాశిరెడ్డి శివ, సలీం, చొల్లంగి శ్రీను, శ్రీహరి, బగంటి సురేష్, కొమ్మన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వై.సి.పి ప్రభుత్వ అరాచక పాలనపై యుద్ధనికి జనసేనపార్టీ సిద్ధం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** వై.సి.పి ప్రభుత్వ అరాచక పాలనపై యుద్ధనికి జనసేనపార్టీ సిద్ధం అని జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ్ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ పేర్కొన్నారు. శుక్రవారం ముత్తా శశిధర్ నాయకత్వంలో పేర్రాజుపేట ప్రాంతంలో విముక్తి కోలనీల సందర్శన సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ ఆధ్వర్యంలో మేము సిద్ధం అనే కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధి అంటే ప్రజాక్షేత్రంలో ఉండి, ప్రజలకూ, ఆప్రాంతానికి ఏమి చేయాలి. అన్న అవగాహన ఉండాలన్నారు. ప్రభుత్వంలో ఉండడం ఒకబాధ్యత అయితే కాకినాడ అభివృద్ధిలో కూడా జనసేన బాధ్యత తీసుకోబోతోందన్నారు. ఈనాడు చూస్తే ఈ విముక్తి కాలనీ చుట్టుపక్కల ప్రాంతాన్ని ఒక డంపింగ్ యార్డు లాగ ఈప్రభుత్వం మార్చేసినదనీ, ఆనాడు 1978 సంవత్సరంలో మా నాయనమ్మగారు ఈకోలనీలో ఆసుపత్రి కట్టించడం, ఆతరువాత ఏ.ఎం.జి వారు, పిమ్మట నాన్నగారు ముత్తా గోపాలక్రిష్ణ గారు ఈప్రాంతంలో అభివృద్ధి చేయడం జరిగిందన్నరు. తరువాత దీనిని అశ్రద్ద చేయడమే కాక దారుణమైన స్థితికి తేవడం హేయమని, వచ్చే ఎన్నికలు పూర్తయాకా జనసేన తరపున ఇక్కడున్న 150 కుటుంబాలకు నేడు మాట ఇస్తోందనీ దీనిని కాకినాడలోని జన్మభూమి పార్క్ మరియు రాజా ట్యాంక్ లను మించిన అభివృద్ధిని ఇక్కడ చేసి చూపిస్తామన్నారు. మానవతా దృక్పధానికి అధికారం తోడైతే అద్భుతాలు సాధ్యం అని చెప్పిన పవన్ కళ్యాణ్ ఆదేశంతో ఈ వై.సి.పి ప్రభుత్వ అరాచక పాలనపై యుద్ధనికి జనసేనపార్టీ సిద్ధం అన్నారు. రానున్న రోజులలో జనసేనపార్టీ ప్రతి ప్రాంతాన్నీ సందర్శించి ప్రాంతాన్ని ఏమెమి అభివృద్ధి చేయబోతామో చెపుతామనీ ముందుగా ఇక్కడనుండీ మొదలెట్టామని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమ్యుక్త కార్యదర్శి వాశిరెడ్డి శివ, జనసేన నాయకులు, జనసైనికులు మరియు వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలంటూ రాస్తారోకో



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందజేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ రాజవొమ్మంగి లో రాస్తా రోకో నిర్వహించారు. శుక్రవారంతమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన రాజవొమ్మంగి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద రహదారిపై సీఐటీయు ఆధ్వర్యంలో మండల ఆశా వర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. తొలిత స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి అల్లూరు జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు, అల్లూరి జంక్షన్ వద్ద రాస్తారోకో ధర్నా కార్యక్రమం చేపట్టారు,ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిగ్గరగా నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ అమ్మిరాజు,కె చంద్రావతి, లక్ష్మి శ్రీ తదితరులు మాట్లాడుతూ ఆశా వర్కర్లుకు కనీస వేతనం చెల్లించాలని, ప్రభుత్వ సెలవులు,మెడికల్ లీవ్ వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ అమలు చేయాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని,ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ గురువారం చలో విజయవాడకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో అక్కడకు వెళ్లనివ్వకుండా ఆశా వర్కర్ల గృహ నిర్భందాలు,పోలీసులు వారిని అక్రమంగా అరెస్టులు చేశారని,వారిపై దాడులకు పాల్పడ్డారని ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు,ఆశాల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు ఆశవర్కర్లు ఐక్యంగా సిద్ధపడాలని పిలుపునిచ్చారు,ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి శ్రీను,ఆశా వర్కర్ల యూనియన్ మండల నాయకులు,కె చంద్రావతి,కె బాలమ్మ,లక్ష్మి శ్రీ, సీత, భవాని, నూకరత్నం, చెల్లయమ్మ, దుర్గ, సూర్యావతి, ఈ సత్యవతి,పెద్ద సంఖ్యల ఆశ వర్కర్ల వున్నారు.

## ఎంపీ సీటును బీసీలకు కేటాయించి జగన్మోహన్ రెడ్డి బీసీల పక్షపతిగా నిలిచారు



కొవ్వూరు, మేజర్ న్యూస్ : కొవ్వూరు వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావును కొవ్వూరులో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పరిచయం చేశారు. ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు శుక్రవారం కొవ్వూరులోని ఆర్ అండ్ బి వసతి గృహంలో జరిగిన నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలారి వెంకటరావు మాట్లాడుతూ రాజమండ్రి ఎంపీ సీటును బీసీలకు కేటాయించి జగన్మోహన్ రెడ్డి బీసీల పక్షపతిగా నిలిచారన్నారు. దానితోపాటు నరసాపురం, ఏలూరు ఎంపీ సీట్లను బీసీలకు కేటాయించి బీసీలకు పెద్ద పేట వేసారన్నారు. గూడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 80 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాల అందించారని ఈ ప్రభుత్వం విద్య వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. 33 పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలను తిరగరాసిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. జగన్మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని నేను రాజకీయాల్లోకి వచ్చాను అన్నారు. రాజకీయ చరిత్రలో రాజమండ్రి ఎంపీ సీటును బీసీలకు ఇవ్వడం హర్షణీయమన్నారు. ప్రజలకు చెరువుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, చైర్ పర్సన్ భావన రత్నకుమారి, ఏలూరి విజయలక్ష్మి,సుంకర సత్యనారాయణ, తోట రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు, ముళ్ళపూడి కాశి, మారిన రామకృష్ణ,ఎంపీపీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో సచివాలయ ఉద్యోగులపై దాడి

**–పిఠాపురం పట్టణం జగ్గయ్యచెర్వు 11వ సచివాలయంలో ఘటన**
**–పోలీసులకు ఫిర్యాదు చేసిన సచివాలయ ఉద్యోగులు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణం 11వ సచివాలయ సిబ్బందిపై ఒక వ్యక్తి విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. 11వ సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ ప్రసాద్ ను దాడి చేశారు. మహిళా పోలీస్‌పై దాడి చేయగా సంధ్యారాణి పై దాడి చేయడంతో...గాయాలయ్యాయి. ఆమె స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. దాడి చేసిన వ్యక్తిని జనసేన కార్యకర్తగా గుర్తించారు. దాడి విషయం తెలుసుకున్న పలువురు సచివాలయ ఉద్యోగులు పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సచివాలయం ఉద్యోగులు మాట్లాడుతూ... రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడి పనిచేస్తున్న ఉద్యోగులపై దాడులు చేయడం అమానుషమని, దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తమకు భద్రత, భరోసా కల్పించాలని కోరారు.

## సత్య దేవా జూనియర్ కళాశాలలో జాతీయ నులుపురుగుల నిర్మూలన దినోత్సవం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నడుపుతున్న శ్రీ సత్య దేవా జూనియర్ కళాశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో సుమారు 400 మంది విద్యార్థిని విద్యార్థులకు రవికంపాడు పిహెచ్ సి నుండి హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎఎన్ఎమ్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఆల్బండజోల్ మాత్రలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి. వెంకట్ మాట్లాడుతూ నులి పురుగుల నిర్మూలన పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాశాల ఎన్ఎస్ఎస్ పి ఒ మాణిక్యంభ, ఎస్. గోవిందు పాల్గొన్నారు.

## కనీస వేతనం ఇవ్వండి

**– తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్ల నిరసన**



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** పి.గన్నవరం మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద పి.గన్నవరం మండలం లో గల ఆశ వర్కర్లు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని నిరసన చేపట్టారు. తమ న్యాయమైన కోర్కెల కొరకు నిరసన చేపట్టిన మా ఆశా వర్కర్లను అరెస్ట్ చేసారని వారిని విడిచి పెట్టాలని, అలాగే కనీస వేతనం ఇవ్వాలని, పని భారాన్ని తగ్గించాలని, పది లక్షలు (గ్రూప్ ఇన్సూరెన్సు కల్పించాలని, రిటైర్ మెంట్ బెనిఫిట్స్, ఐదు లక్షలు, ప్రభుత్వ సెలవులు, మెడికల్ సెలవులు వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు అమలు చేయాలని, ఇల్లు లేనివారికి ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేసారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిరసన తెలిపారు. ఆశా వర్కర్ల నిరసనకు పి..గన్నవరం వి.ఆర్.ఓ.లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.సుబ్బలక్ష్మి, వై.జ్యోతి మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సూర్య

తూర్పుగోదావరి
శనివారం
10 ఫిబ్రవరి 2024





## ఇ - క్రాప్‌తో అన్నదాతలకు భరోసా

**- ఏడిఏ ఎన్.దైవకుమార్**

**పెద్దాపురం మేజర్ న్యూస్ :** ఇ-క్రాప్ నమోదుతో అన్నదాతలకు భరోసా లభిస్తుందని, పెద్దాపురం వ్యవసాయ శాఖ ఏడిఏ ఎన్.దైవకుమార్ తెలిపారు. ఈ నెల 15వ తేదిలోగా ఇ-క్రాప్, ఇ-కెవైసి పూర్తి చేయాలని, వ్యవసాయ శాఖ సిబ్బందికి ఆయన సూచించారు. రబీ సీజన్‌లో ఇ-క్రాప్ నమోదు వేగంగా సాగుతుందని, రైతులు వారి పొలాల్లో ఏ పంటలు సాగు చేస్తున్నారనే వివరాలు వ్యవసాయ శాఖ నమోదు చేస్తుందని ఆయన తెలిపారు. ఇ-క్రాప్ ప్రామాణికంగానే రైతులకు ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తుందని, దీంతో పంటలు వేసిన ప్రతీరైతును వదలకుండా ప్రతీ ఎకరాలో ప్రతీ పంటను నమోదు చేయడం వ్యవసాయ శాఖ లక్ష్యమని ఆయన తెలిపారు. కావున ఈ నెల 15వ తేదిలోగా ఇ-క్రాప్, ఇ కెవైసి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన సూచించారు. ఇ-కెవైసి నమోదు ప్రక్రియ పూర్తి కాగానే ప్రతీ రైతుకు రశీదు అందించే ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.



## మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి. శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# అనపర్తిలో పలు రైళ్ల హాల్ట్‌కి రైల్వే మంత్రికి సిఫార్సు చేసిన సోము వీర్రాజు

**...ర్తి, మేజర్ న్యూస్ :** ఎన్నికల ముందు వాగ్దానాలు, గెలుపొందిన తర్వాత వాగ్దానాన్ని తుంగలో తొక్కడం రాజకీయ నాయకులకు అలవాటైపోయి ఒడటంలో ఏమాత్రం సందేహం లేదేమో... నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే అనపర్తి రైల్వే స్టేషన్ లో కొన్ని ఎక్స్ ప్రెస్ రైలు నిలుపుదల విషయమై అనపర్తి ప్రాంత ప్రజల కల కలగానే మిగిలిపోయింది. ఇటీవల అనపర్తి విచ్చేసిన బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజును అనపర్తి రైల్వే పాసింజర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి అనపర్తి రైల్వే స్టేషన్ అభివృద్ధిపై దృష్టి సారించాలని, ప్రధానంగా ఈ రైల్వే స్టేషన్ లో జన్మభూమి అప్, డౌన్, గౌతమి ఎక్స్ప్రెస్ కు డౌన్ హాల్ట్ ఇప్పించమని వినతి పత్రం అందజేయగా వెంటనే ఆయన స్పందించి తన వంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాక అందరిలా వినతి పత్రాన్ని చెత్తబుట్టలో పడేయకుండా రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు అనపర్తిలో రైళ్ళ హాల్ట్ ఆవశ్యకతను వివరిస్తూ జన్మభూమి, గౌతమి ఎక్స్ప్రెస్‌లకు హాల్ట్ ఇప్పించాలని కోరుతూ సోము వీర్రాజు సిఫారసు లేఖ పంపడంతో జరిగింది. గతంలోఎంపీగా పనిచేసిన సినీ నటుడు



మాగంటి మురళీమోహన్ మాత్రమే రెండు రైళ్లకు అనపర్తిలో హాల్ట్ ఇప్పించడం జరిగిందని దీనికి ముందు అనపర్తి అసెంబ్లీ నుండి ఎంపిగా అత్యధిక మెజార్టీతో గెలిపించినప్పటికీ ఉండవిల్లి అరుణ్ కుమార్ కానీ, ప్రస్తుత ఎంపీగా పనిచేస్తున్న మార్గాని భరత్ రామ్ కానీ అనపర్తికి మరిన్ని రైళ్ళ హాల్ట్ తీసుకురావడం జరుగుతుందని కల్లబొల్లి కబుర్లు చెప్పడమే తప్ప రైళ్లకు హాల్ట్ మాత్రం తీసుకు రాలేక పోయారని అనపర్తి పరిసర ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనపర్తి, బిక్కవోలు, రాయవరం రంగంపేట, పెదపూడి, మండపేట, రామచంద్రపురం వంటి ఎన్నో ప్రాంతాల నుండి రైల్వే ప్రయాణికులు అనపర్తి రైల్వే స్టేషన్ నుండి ప్రతిరోజు ప్రతి రైలులో వందలాదిమంది ప్రయాణించడం, రైల్వే శాఖకు అత్యధిక ఆదాయం చేకూర్చడం జరుగుతుంది. ముఖ్యంగా ఈ ప్రాంతాల యువత వ్యాపార రీత్యా అనేక రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు సైతం ప్రయాణించడంతో నిత్యం రైల్వే స్టేషన్ ప్రయాణికులతో రద్దీగా ఉంటుందని ఇటువంటి అనపర్తి రైల్వే స్టేషన్ లో మరెన్నో రైళ్లకు హాల్ట్ కల్పించాల్సిన బాధ్యత లోక్ సభ సభ్యులపై ఉందని పలువురి అభిప్రాయం. ఓటు వేయించుకుని మొండి చేయి చూపిన ఎంపీలకంటే బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు బెటర్ అని ప్రశంసిస్తున్నారు. కనీసం ఈ రెండు రైళ్లకు హాల్ట్ తీసుకు రాగలిగితే అనపర్తి పరసర ప్రాంత ప్రజల గుండెల్లో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రజలనుకుంటున్నారు. ఎక్స్ప్రెస్ రైళ్లు హాల్ట్ కు కృషి చేస్తున్న సోము వీర్రాజుకు రైల్వే పాసింజర్స్ అసోసియేషన్ సభ్యులు, అనపర్తి ప్రాంత ప్రయాణికులు, అనపర్తి ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జేపివి కేంద్రాలలో మార్చి ఒకటవ తేదీ నుంచి పాల సేకరణ

**- ఇంటింటి సర్వే ప్రక్రియను ప్రారంభించాలి**
**- జేసీ తేజ్ భరత్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జగనన్న పాల వెల్లువ పై శనివారం నుంచి గ్రామ స్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించి పాడి రైతుల లబ్దిదారుల గుర్తింపు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ స్పష్టం చేశారు. శుక్రవారం హుకుంపేట గ్రామ సచివాలయం 1లో పాలసేకరణ పై గ్రామ సచివాలయ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెసి హాజరయ్యారు. ఈ సంధర్భంగా జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా జగనన్న పాల సేకరణ పై జిల్లా, డివిజన్, మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. తదుపరి ప్రక్రియ కోసం గ్రామ స్థాయి, సచివాలయ పరిధిలో చేపట్టవలసిన సర్వే పై క్షేత్ర స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించడం జరుగుతోందనీ పేర్కొన్నారు. ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ ద్వారా సేకరించిన పాలకు వెన్న శాతం, చిక్కదనం ఆధారంగా ధర చెల్లింపులు చేస్తామని తెలియ చేశారు. జిల్లా లో చేయూత, ఆసరా కింద ప్రయోజనం కలిగిన పశు రైతులను గుర్తించి, వారి వివరాలూ జే పీ వి.. పోర్టల్ లో నమోదు చెయ్యాల్సి ఉందన్నారు. మండల పరిధిలో ఉన్న జగనన్న పాల వెల్లువ కేంద్రానికి గ్రామ సచివాలయం ఉన్న పాడి రైతు లబ్దిదారుల ద్వారా పాల సేకరణ చేపట్టవలసి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్క పాల రైతుకి ఎనిమిది అంకెల తో కూడిన డిజిటల్ నెంబర్ ఇవ్వడం జరుగుతుందనీ, ఆమేరకు పాల సేకరణ జరిపిన వెన్న శాతం, చిక్కదనం ఆధారంగా చేసుకుని నేరుగా నగదు చెల్లింపులు చేస్తామని తెలియ చేశారు. మార్చి ఒకటవ తేదీ నుంచి పాల సేకరణ ప్రక్రియ ను ప్రారంభించడం జరుగుతుందనీ, ఆలోగా వాలంటీర్లు సేకరించిన డేటా ఎంట్రీ సంభందిత డిజిటల్ అసిస్టెంట్ ద్వారా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో రూరల్ ఎంపీడీవో డి. శ్రీనివాస రావు, మండల వెటర్నరీ డాక్టర్ డా సౌమ్య, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పాఠశాల విద్యా అధికారిగా వాసుదేవరావు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాకు జిల్లా పాఠశాల విద్యా అధికారిగా కే.వాసుదేవ రావు శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టిన అనంతరం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలక్టర్ డా కే. మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేశారు. త్వరలో నిర్వహించనున్న 10 వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం ప్రత్యేక దృష్టి సారించాలనీ జిల్లా కలక్టర్ మాధవీలత ఆదేశించారు. ఇప్పటి వరకూ కే. వాసుదేవ రావు విజయనగరం జిల్లా లో ఉప పాఠశాల విద్యా అధికారిగా బాధ్యతలు నిర్వహించిన వాసుదేవ రావు జిల్లా పాఠశాల విద్యా అధికారి గా బదలీపై జిల్లాకు రావడం జరిగింది.

## నిర్బంధానికి నిరసనగా ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరించిన ఆశ వర్కర్లు



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్స్ ధర్నా నిర్వహించారు. ఎనిమిదో తేదీ విజయవాడ ధర్నా సందర్భంగా ఆశా కార్యకర్తలపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి నిర్బంధాన్ని విధించడం పట్ల నిరసనగా 9, 10 తేదీలలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భహిష్కరిస్తున్నామని ఆశ వర్కర్స్ అర్బన్, రూరల్ కార్యదర్శులు సత్య కుమారి, హెన్రీ గ్రేస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్, అంగన్వాడీ అర్బన్ కార్యదర్శి టి . నాగమణి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్. వరలక్ష్మి మాట్లాడుతూ, విజయవాడ కార్యక్రమానికి ఒకరోజు ముందే ఉదయం 7 గంటల నుండి సచివాలయ మహిళా పోలీసుల ద్వారా ఆశా కార్యకర్తల ఇళ్లకు మగ పోలీసులు వెళ్లి హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26000 చెల్లించాలని శాంతియుత ఆందోళనకు కూడా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనుమతించడం లేదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మహిళలని కూడా చూడకుండా పురుష పోలీసులు ద్వారా నిర్బంధాన్ని ప్రయోగించి జగన్మోహన్ రెడ్డి తన నిజ స్వరూపాన్ని బయట పెట్టుకున్నాడని విమర్శించారు. మహిళా సాధికారత అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో రాష్ట్ర ప్రజానీకానికి ప్రాణాలకు తెగించి సేవలు చేసినందుకు జగన్ ప్రభుత్వం పోలీసులతో చేసిన సత్కారానికి రాబోయే ఎన్నికల్లో రుణం తీర్చుకుంటామని తెలిపారు ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ వారికి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని నిత్యాన్నదాన ప్రధకానికి రూ.లక్ష విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బెంగుళూరుకు చెందిన కె.పి.నాయుడు రూ.1,00,000లు విరాళమును దేవస్థానం పిఆర్వో విభాగం గణపతికి అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో జూన్ 14వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా దాత కోరారు. ఈ సందర్భంగా దాతలను పిఆర్వో విభాగం అధికారి గణపతి అభినందించారు.

# మానవ అక్రమ రవాణా & వెట్టిచాకిరీ నిషిద్ధం

**-సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** శుక్రవారం వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు మరియు ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగం 23వ అధికరణ ప్రకారం మానవ అక్రమ రవాణా మరియు వెట్టిచాకిరీ నిషిద్ధం అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారికి చట్టపరమైన శిక్షలు ఉన్నాయన్నారు. "వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం, 1976"లోని కీలక అంశాలను ఆమె వివరించారు. మనుషులను స్వచ్ఛందంగా కాకుండా బలవంతంగా, మోసపూరితంగా, బెదిరింపులతో పని చేయించుకోవడం, ఆ పనికి తగినంత వేతనం ఇవ్వకపోవడం, వారిని నిర్బంధంలో ఉంచి స్వేచ్ఛకు భంగం కలిగించడం నేరమని పేర్కొన్నారు. ఈ నేరాలను పోలీసు వారు కేసు నమోదు చేసి విచారించే అధికారం ఉంటుందని తెలిపారు. వెట్టిచాకిరీ బాధితులను గుర్తించడం, రక్షణ కల్పించడం, విడిపించి పునరావాస చర్యలు తీసుకోవడంలో వివిధ శాఖల పాత్ర గురించి వివరించారు. అందరి సమన్వయ కృషితో ఈ చట్టం మెరుగ్గా అమలు జరుగుతుందని అన్నారు. అనంతరం న్యాయమూర్తి ప్రత్యూష కుమారి కార్యక్రమానికి హాజరైనవారందరితో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం నుంచి పుష్కర ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించారు, మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సదస్సులో, అనంతరం ర్యాలీలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి.ఎస్. ఎం.వలీ, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, మైన్స్ అండ్ జియోలాజి అసిస్టెంట్ డైరెక్టర్ ఎమ్ . సుబ్రహ్మణ్యం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ హెడ్ ప్రోగ్రాం పార్టనర్షిప్ మేనేజర్ ఎం. జేసుదాస్ , రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, డి.ఆర్.డి.ఏ., మెప్మా, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సభ్యులు, ఒన్ స్టాప్ క్రైసిస్ టీమ్ సభ్యులు, వివిధ ఎన్జీవో సంస్థల వారు, తదితరులు పాల్గొన్నారు.

## 16న గ్రామీణ భారత్ బంద్

**-సంయుక్త కిసాన్ మోర్చా**
**-కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** కేంద్ర మోడీ ప్రభుత్వ రైతాంగ,కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు జరుగుతున్నగ్రామీణ భారత్ బంద్-పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు,కార్మిక, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఐక్య వేదిక సంయుక్త జిల్లా సమావేశం బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్, ఐఎఫ్ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా,జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు తలారి ప్రకాష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణమాచార్యులు,ఆర్.శ్రీనివాస డాంగే, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ఎస్.కె.బాషా,శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు కె.విజయలక్ష్మి,ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి తదితరులు మాట్లాడారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

**ముసునూరు,మేజర్‌న్యూస్:** మండలంలోని పోలింగ్ కేంద్రాలను మండల స్థాయి అధికారులు, పోలీసు అధికారులతో కలసి శుక్రువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సత్యవతి దేవి, డిప్యూటి తహాసిల్దార్ ఏమిలి కుమారి లు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జరగబోయే సార్వత్రిక ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నిక సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవలసిన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముసునూరు ఎస్ఐ వాసు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం, బియ్యం స్టాక్ వివరాలు ఇకపై ప్రతీ శుక్రవారము పోర్టల్‌లో నమోదు చెయ్యాలి

**-మిల్లర్లు, వ్యాపారస్తులు వీటిపై పూర్తి స్థాయిలో అవగాహన పొందాలి**
**-సిఎస్‌డిటిలు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టి నిర్ధారణ చేసుకోవాలి**
**-జేసీ తేజ్ భరత్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ నిర్దేశాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లాలోని అందరు ట్రేడర్సు/ హోల్ సేలర్స్ , రిటైలర్స్, బిగ్ చైన్ రిటైలరు , మరియు ప్రోసెసర్సు, మిల్లర్స్ అందరునూవారీ వద్ద వున్న బియ్యం / ధాన్యము యొక్క నిల్వలు స్థితిని బ్రోకెన్ రైస్, నాన్ బాస్మతి బియ్యం, పారాబాయిల్డ్ రైస్, బాస్మతి రైసు ధాన్యము వివరాలూ సంభందిత పోర్టల్ వారం రోజులు లోగా నమోదు చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లో రైస్ ట్రేడర్సు/ హోల్ సేలర్స్ , రిటైలర్స్, బిగ్ చైన్ రిటైలరు , ప్రోసెసర్సు, మిల్లర్స్‌తో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లడుతూ, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం వారు నిర్దేశించిన మేరకు జిల్లాలో ఉన్న ధాన్యం, బియ్యం యొక్క స్టాక్ వివరాలు నిర్దేశిత పోర్టల్ నందు ఏడు రోజులలోపు తప్పక నమోదు చేయలన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించాల్సి ఉంటుందనీ తేజ్ భరత్ తెలిపారు. ప్రస్తుతం ధాన్యం బియ్యం వివరాలూ నమోదు చేయడంతో పాటు ఇకపై ప్రతి శుక్రవారం నిరంతరం కొనసాగించవలసిందిగా ఆదేశించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించడం ద్వారా బియ్యం వ్యాపారమునకు సంబంధించిన అమ్మకం, నిలవ తదితర అంశాలపై రైస్ మిల్లరులకు అవగాహన కల్పించు నిమిత్తం సమావేశం నిర్వహించినట్లు తెలియ చేశారు. మండల పరిధిలో ఉన్న సి ఏస్ డీ టి లు వారీ పరిధిలో ఉన్న వ్యాపారులు, హోల్ సేల్, రిటైలర్స్ మిల్లర్లు సంభందిత డేటా ఎంట్రీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పకుండా స్టాక్ వివరాలు, బోర్డ్ ప్రదర్శించాలి అని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు సంధర్భంగా మార్గదర్శకాలు ఖచ్చితంగా అమలు చేసేలా అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశమునకు జిల్లా పౌర సరఫరాల అధికారి పి. విజయ భాస్కర్, బియ్యం అమ్మకం దారులు మరియు రైసు మిల్లర్లు యొక్క ప్రతినిధులు సీహెచ్. బ్రహ్మాజీ, ఎబి ఎన్ ప్రసాద్, కే. సుబ్రహ్మణ్యం, వి. శివకృష్ణ, సిహెచ్ సుబ్బారావు, ఎన్. బుల్లి మోహన్ రెడ్డి, దొరయ్య , చిన్ని కృష్ణా, భాస్కర్, ఎమ్. బాల సుబ్రహ్మణ్యం, పౌర సరఫరాల అధికారులు, సిబ్బంది హాజరైనారు.

## న్యాయ సేవాధికార సంస్థ,లేబర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో -వెట్టిచాకిరీ పై అవగాహన సదస్సు

ఏలూరు,మేజర్‌న్యూస్ : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్,డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనం నుండి ఫైర్ స్టేషన్ వరకు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ , స్లొగన్స్ వినిపిస్తు స్థానిక ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి, ఫైర్ స్టేషన్ వద్ద మానవహారంగా ఏర్పడి వెట్టి చాకిరి నిర్మూలనకు స్థానికులకు అవగాహన కలిగించే విధంగా నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. తదనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనము నందు పరిశ్రమల యాజమాన్యంతోను,సంబంధిత ఉద్యోగుల తోనూ వెట్టి చాకిరి నిర్మూలనకై తీసుకోవలసిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లుగా తెలియజేశారు.

## ప్రమాదానికి గురైన కార్యకర్తలకు పరామర్శ

**టిడిపి నాయకులు ముప్పిడి సురేష్ రెడ్డి**

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని దర్భ గూడెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు ఇటీవల ప్రమాదానికి గురైన మోయ్యటి జాను, జాల వెంకటేష్, జాల సత్తియా లకు గ్రామ టిడిపి నాయకులు ముప్పిడి సురేష్ రెడ్డి బాధితుల ఇంటికి వెళ్లి బాధితులను కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ అవసరాలు నిమిత్తం ఒక్కొక్కరికి రూ.2 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భాన్ని ఉద్దేశించి ముప్పిడి సురేష్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు అన్నివేళలా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయల ఏసు, బచ్చు వీరస్వామి, కలపాల శ్రీను, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వన దన్ వికాస కేంద్రాలు

**- జిసిసి ఎండి జి.సురేష్ కుమార్**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం వన దన్ వికాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిసిసి ఎండి జి సురేష్ కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని శరభవరం, రాజవొమ్మంగి టు జిసిసి డిపోలో వద్ద జిసిసి మేనేజర్ విజయలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ ప్రాంతంలో జీడి పంట ఎక్కువగా ఉంటుంది కాబట్టి జీడిపిక్కలు నుండి పప్పు వేరు చేసే యూనిట్ విలువ 15 లక్షలు ఉంటుందని దానిని ఐటిడిఏ సమకూరుస్తుందని భవనం మాత్రం లబ్ధిదారులు చూసుకోవాలని ఎండి వివరించారు. అలానే ఈ ప్రాంతంలో గిరిజన ఉత్పత్తులు జిసిసి ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ గౌరమ్మ, సేల్స్ ఉమెన్‌లు మాతయ్యమ్మ, లక్ష్మి, సత్యవతి, సిబ్బంది ఉన్నారు.

## శ్రీరామ నిత్య జపంతో మానసిక వికాసం

**శ్రీశ్రీశ్రీ వాసుదేవ గురుస్వామి**

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** లోక కళ్యాణార్థం పుణ్యక్షేత్రానికి పాదయాత్రలు చేయడం ప్రజల్లో ధార్మిక చైతన్యం కోసం శ్రీరామ్ అనే శబ్ద వాచకం నిత్యం జపం చేయడం వలన మానసిక వికాసం శ్రీరాముని యొక్క దివ్య ఆశీస్సులు లభిస్తాయి అని శ్రీశ్రీశ్రీ వాసుదేవ గురుస్వామి పేర్కొన్నారు. కాకినాడ అచ్చంపేట నుంచి నాలుగో తేదీన శ్రీ వాసుదేవ గురుస్వామి యొక్క ఆధ్వర్యంలో 350 మంది మహిళలు యువకులు వృద్ధులు శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య రథోత్సవ పాదయాత్రగా భద్రాచలం కు బయలుదేరగా ఆరవ రోజున జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం ఆంజనేయ స్వామి విగ్రహం వెనుక శివాలయం వద్ద దర్భ గూడెం సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు ఆధ్వర్యంలో 350 మంది రామభక్తుల పాదయాత్రికులకు భోజన ప్రసాదములు వసతిని ఏర్పాటు చేసినారు. ఈకార్యక్రమంలో అన్న ప్రసాదము దాత కొల్లూరి రాంబాబు,చంటయ్య,గుర్రాల సురేష్ లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నులిపురుగుల మందులు పంపిణీ

**ముసునూరు,మేజర్‌న్యూస్:** నులిపురుగుల దినోత్సవాన్ని సందర్భంగా మండలంలోని పాఠశాలల్లోని విద్యార్థిని, విద్యార్థులకు ఎంపిడిఓ సత్యవతి దేవి శుక్రువారం నులిపురుగుల మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను రక్తహీనత నుండి కాపాడడానికి ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమం అని, ఈ నులిపురుగుల మందులను ప్రతి విద్యార్థిని, విద్యార్థులు, చిన్న పిల్లలు వేసుకోవాలన్నారు. దీంతో పిల్లలకు రక్తహీనత నుండి రక్షించ వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో పెరగనున్న శారీరక దారుఢ్యం

**యలమంచిలి, మేజర్ న్యూస్:** మండలం కలగంపూడి గ్రామంలో వీజీ రాజు స్పోర్ట్స్ గేమ్ ను పాలకొల్లు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఇటువంటి అధునాతన స్పోర్ట్స్ రావడం క్రీడాకారులకు శరీర ధారుఢ్యం పెరుగుతుందని అన్నారు , ఈ కార్యక్రమంలోయలమంచిలి మండలం కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు గుంటూరి నాగరాజు గారు ఎం. లక్ష్మణ రాజు, శ్రీనివాస్ రాజు ,పొత్తూరి ప్రసాద్ రాజు , గుబ్బల వంగరావు , కౌరు శ్రీనివాస్ వలవాల రవి రావు మొదలుగు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.